క్లుప్తంగా

పేదల సంక్షేమమే ధ్యేయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

బెజ్జంకి(సిద్దిపేట): పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని ముత్తన్నపేటలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. బెజ్జంకి మోడల్ స్కూల్‌లో కిచెన్ షెడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్య రక్షణ కోసం ఎల్‌ఓసీలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, రత్నాకర్‌రెడ్డి, హర్షిత్‌కౌర్ పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక చట్టాలు



అవగాహన కల్పిస్తున్న అధికారి

బెజ్జంకి (సిద్దిపేట): మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించిందని ఏఎస్‌ఐ శంకరరావు అన్నారు. మండలంలోని దాచారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ షీ టీమ్ నిర్వహిస్తున్న విధులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి వివరించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సిద్దిపేట షీటీమ్ బృందం కిషన్, ఏఎస్‌ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

హుస్నాబాద్: పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత నేతృత్వంలో సోమవారం ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం చెట్లను రక్షించు కుంటే అవి మనల్ని రక్షిస్తాయని చెప్పారు. చెట్లు కార్బన్ డైయాక్సైడ్ తీసుకొని మనకు ఆక్సిజన్ ఇస్తాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నళినీదేవి, స్వర్ణలత, రమేశ్, హరీశ్, కో–ఆప్షన్ మెంబర్ అయూబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, ఇన్‌చార్జి ఆర్‌ఐ శివకుమార్ పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తున్న ప్రభుత్వం: బీఆర్‌ఎస్ నేత



బియ్యం అందజేస్తున్న అంజిరెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో ఇటీవల ఆర్థిక ఇబ్బందులను తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ధర్మారం కనకయ్య కుటుంబ సభ్యులను సోమవారం ఆయన పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబీమా పథకాన్ని అమలు చేయకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో బాబు, మల్లయ్య, నర్సయ్య, బాల్‌రాజయ్య, చంద్రయ్య, నర్సింహులు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మొద్దు

గజ్వేల్‌రూరల్: ప్రజలు అపరిచితులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని, సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలకు స్పందించవద్దని సీఐ సైదా సూచించారు. మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాలని సూచించారు. మహిళలకు రక్షణగా షీటీమ్ పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అందని 'అంగన్‌వాడీ'

- గ్రామంలో కేంద్రం ఏర్పాటు చేయాలి
- చిన్నారులకు అందని సేవలు
- మూడు కిలో మీటర్లు వెళ్లాల్సిందే..
- గర్భిణులకు అందని పౌష్టికాహారం



పంచాయతీ కార్యాలయం ఎదుట తమగోడు తెలియజేస్తున్న మహిళలు

ఆ గ్రామం ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైనా అంగన్‌వాడీ సేవలు అందడం లేదు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం, ఇతర సేవల కోసం ప్రతి నెలా మూడు కిలో మీటర్లు నడవాల్సిందే. లేదంటే వేరే గ్రామ అంగన్‌వాడీ టీచర్ ద్వారా రప్పించుకోవాలి. ఆమెకు రవాణా చార్జీలు చెల్లించాల్సిఉంటుంది. అలా వెళ్లలేకపోయినా, వేరే గ్రామ అంగన్‌వాడీ టీచర్ రాకపోయినా పిల్లలకు పౌష్టికాహారం అందని ద్రాక్షగానే మారింది.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

మండలంలోని కొండాపూర్ గ్రామం గత ప్రభుత్వ హయాంలో పంచాయతీగా ఏర్పాటైంది. అంతకు ముందు గొల్లపల్లి పంచాయతీ పరిధిలోని మధిర గ్రామంగా ఉండేది. అయితే గ్రామంలో 85కుటుంబాలు ఉండగా, పురుషులు 176, స్త్రీలు 184 ఉన్నారు. అందులో ప్రస్తుతం నలుగురు గర్భిణులు, ఒక బాలింత ఉన్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 17మంది ఉండగా, మూడేళ్ల నుంచి ఆరేళ్ల చిన్నారులు 19మంది ఉన్నారు.

కేంద్రం లేక కష్టాలు

గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం వల్ల పిల్లల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో జాప్యం జరుగుతోంది. దీంతో పిల్లలకు ప్రతినెలా సక్రమంగా పౌష్టికాహారం అందడం లేదు. ఆరేళ్ల క్రితం పంచాయతీగా ఏర్పాటైనా గ్రామంలో అంగన్‌వాడీ సేవలు మాత్రం అందడం లేదు. దీంతో ప్రతినెలా గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కావాల్సిన సరుకులు, టీకాలను తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు.

మూడు కిలో మీటర్లు వెళ్లాల్సిందే..

అంగన్‌వాడీ సేవలు అందలాంటే ప్రతినెలా మూడు కిలో మీటర్లు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లల సంఖ్యను నమోదు చేస్తేనే పౌష్టికాహారం అందజేస్తారు. లేదంటే అందడం లేదని చిన్నారుల తల్లులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా ఆటోలో వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నామని, లేదంటే గొల్లపల్లి అంగన్‌వాడీ టీచర్ గ్రామానికి వస్తే రవాణా చార్జీలు చెల్లిస్తున్నామని వారు అంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి



గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడం వల్ల మేము చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతినెలా గొల్లపల్లికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రత్యేక పంచాయతీ ఏర్పాటైనా అంగన్‌వాడీ సేవలు అందడం లేదు.

– సారిక, కొండాపూర్

పిల్లలను పొలాలకు తీసుకుపోతున్నాం



గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలను మాతో పాటు పొలాలకు తీసుకుపోతున్నాం. దీంతో చిన్నారులు అవకాశం కోల్పోతున్నారు. కేంద్రం ఏర్పాటు చేయాలని మూడు, నాలుగేళ్ల నుంచి అధికారులకు విన్నవిస్తున్నా ఫలితం లేకుండా పోయింది.

– భవాని, కొండాపూర్

టోర్నమెంట్ విజేతగా ఎంసీఎఫ్ దుబ్బాక



ఫైనల్ విజేత ఎంసీఎఫ్ టీమ్‌తో నిర్వాహకులు

దుబ్బాకటౌన్: చిన్న గుండవెల్లిలో బోర్‌వెల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 రోజులుగా నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో దుబ్బాకకు చెందిన మార్నింగ్ క్రికెట్ ఫ్రెండ్స్ (ఎంసీఎఫ్)టీం విజేతగా నిలిచింది. ఆ రెండు టీంలకు ఫైనల్ మ్యాచ్ సోమవారం రసవత్తరంగా సాగింది. ఎంసీఎఫ్ టీం 12 ఓవర్లలో 79పరుగులు చేసింది. బోర్‌వెల్స్ టీం 41పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 30 పరుగుల ఆధిక్యంతో ఎంసీఎఫ్ విజేతగా నిలిచింది. అనంతరం ఆర్గనైజర్లు విజేత ఎంసీఎఫ్ టీమ్‌కు రూ.40వేలు నగదు బహుమతితో పాటు కప్‌ను అందజేశారు. చిన్న గుండవెల్లిలో వరుసగా జరుగుతున్న రెండు టోర్నమెంట్‌లలో ఎంసీఎఫ్ రెండు సార్లు విజేతగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ దుబ్బాకలో మైదానం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, స్టేడియం నిర్మించాలని కోరారు.

గ్రామసభలో గందరగోళం

వాయిదాకు తీర్మానం చేసిన గ్రామస్తులు



గ్రామసభను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మిట్టపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియపై సోమవారం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొంది. అర్బన్ మండల తహసీల్దార్ సలీం అధ్యక్షతన ఈ సభ నిర్వహించారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా భూసేకరణ కోసం గ్రామసభ ఎలా నిర్వహిస్తారంటూ ప్రతిపాదిత సర్వీస్ రోడ్డు భూనిర్వాసితులు అధికారులను ప్రశ్నించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని 1500మీటర్ల నుండి 300 మీటర్లకు కుదించాలని కలెక్టర్‌కు, ఆర్డీఓకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోలేదని, ఇప్పుడు కొత్తగా సర్వీస్ రోడ్డు కోసం భూసేకరణ చేసేందుకు ఎలా చర్యలు తీసుకుంటున్నారని నిలదీశారు. అడిషనల్ కలెక్టర్, ఆర్డీఓ, స్పెషల్ ఆఫీసర్ హాజరై తమకు సమాధానం చెప్పాలని, వారు హాజరైనప్పుడే గ్రామసభ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేసి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ సంతోష్, గ్రామస్తులు యాదగిరి, నర్సింహారెడ్డి, రాజయ్య, బుచ్చయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తుడిపై కేసు నమోదు

కొమురవెల్లి(సిద్దిపేట): దైవ దర్శనానికి వచ్చి స్థానిక మహిళపై అనుచితంగా ప్రవర్తించిన ఓవ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం చేటు చేసుకుంది. ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తుప్రాన్‌కు చెందిన ఐదుగురు యువకులు స్వామివారి దర్శనానికి వచ్చి ఓ ప్రైవేట్ గదిలో బస చేశారు. సోమవారం ఉదయం వారిలో ఒకడైన ఆకుల శశాంక్ అలియాస్ అభి స్థానికంగా నివాసం ఉంటున్న మహిళపై అనుచింగా ప్రవర్తించాడు. దీంతో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక డంపు సీజ్

వర్గల్(గజ్వేల్): మండలంలోని వేలూరు గురువన్న గుట్ట దగ్గర అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. సోమవారం సీతారాంపల్లి గ్రామస్తుల ద్వారా అందిన సమాచారం మేరకు తనిఖీ చేశామని ఆయన చెప్పారు. రెండున్నర లారీల ఇసుక డంపు గుర్తించి సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక నిల్వచేసినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

19న సదస్సు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాలయాపన చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం యాదాద్రి జిల్లాలో 19న జరిగే ఎమ్మార్పీఎస్ సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి రాజమల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మాటతప్పిన బీజేపీపై మరోసారి మాదిగలు ఉద్యమించడానికి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మాదిగలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

చిన్నారులను చేర్పించండి

అంగన్‌వాడీ టీచర్ల ర్యాలీలు



రిమ్మనగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు

'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా సోమవారం అంగన్‌వాడీ టీచర్లు స్వయం సహాయక బృందాల సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అయిదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి వారి భవితకు పునాది వేయాలని నినాదాలు చేశారు.

గజ్వేల్/బెజ్జంకి(సిద్దిపేట)/కోహెడరూరల్(హుస్నాబాద్)/మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రజని, పద్మ, ఐకేపీ సిబ్బంది కృష్ణలీల, శ్రీలత, ఆశావర్కర్లు దర్గమ్మ, హేమలత పాల్గొన్నారు. బెజ్జంకిలో ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు రాజేందర్, నర్సింహారెడ్డి, స్వప్న, జలజ తదితరులు పాల్గొన్నారు. కోహెడరూరల్‌లోని రాంచంద్రపూర్‌లో అంగన్వాడీ కార్యకర్త డి.పద్మ పాల్గొన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రేణుక, అంబబాయి, రాజ్యం, శోభ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



మొక్కలు నాటుతున్న రాజమౌళి

గజ్వేల్: పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి చెప్పారు. పట్టణంలోని డంపింగ్ యార్డును సోమవారం సందర్శించారు. తడి, పొడి చెత్తను వేరు చేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని చెప్పారు. ప్రస్తుత వానాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సిబ్బంది పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చూడాలని సూచించారు. డంపింగ్ యార్డులో మొక్కలు నాటారు. అనంతరం సంగు పల్లిలో డ్రైనేజీలను పరిశీలించి మరమ్మతులకు చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య, ఏఈ శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్ బబ్బూరి రజిత పాల్గొన్నారు.

చెరువులను నింపి రైతులను ఆదుకోండి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

కొమురవెల్లి(సిద్దిపేట): చెరువులు, కుంటలను నింపి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. సోమవారం ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు ద్వారా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపితే తద్వారా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలలోని చెరువులు, కుంటలను నింపే అవకాశం ఉంటుందన్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం ఆ విషయం మరిపోయిందని ఆరోపించారు. రైతులంతా నార్లుపోసి పొలం దున్నలేని పరిస్థితిలో ఉన్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి దేవాదుల నుంచి నీటిని విడదల చేసి చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నాలుగు మండలాల రైతులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, శారద, అరుణ్ కుమార్, ఇస్తారి, బాల కిషన్ పాల్గొన్నారు.

'మొక్కజొన్న' ధ్వంసం

ఇద్దరిపై కేసు నమోదు

వర్గల్(గజ్వేల్): మండలంలోని మజీద్‌పల్లి శివారులో పొట్టదశకు వచ్చిన మొక్కజొన్న పంటను ధ్వంసం చేసిన ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు బేగంపేట ఏఎస్‌ఐ అరుణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వర్గల్ మండలం దండుపల్లికి చెందిన కాస మహిపాల్‌కు మజీద్‌పల్లి శివారులోని ఉన్న 1.03ఎకరాల భూమిలో రెండు నెలల క్రితం మొక్కజొన్న వేశాడు. అది పొట్టదశకు చేరుకున్న దశలో ఆదివారం రాత్రి అతడి పెద్దనాన్న కొడుకు కాస కృష్ణ భూమి తమదేనంటూ ట్రాక్టర్‌తో చేనును దున్ని ధ్వంసం చేశాడు. బాధితుడు మహిపాల్ ఫిర్యాదు మేరకు కృష్ణ, అతడి తండ్రి శివులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సేవలతోనే సముచిత గౌరవం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి



టీచర్‌ను సన్మానిస్తున్న రాణి తదితరులు

వర్గల్(గజ్వేల్): బాధ్యతాయుత సేవలతోనే గౌరవం, గుర్తింపు దక్కుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. సోమవారం వర్గల్ మండలం తున్కిఖాల్సాలో అంగన్‌వాడీ టీచర్ వేములగట్టు సుజాత ఉద్యోగ విరమణను పురస్కరించుకుని అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆట, పాటలతో చిన్నారులకు 38సంవత్సరాల పాటు సేవలందించి సుజాత వృత్తికి వన్నెతెచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో వర్గల్ సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు.

'గతుకు' జీవుడా!



మండలంలోని రాంచంద్రపూర్ నుంచి గాగిల్లాపూర్ వెళ్లే రోడ్డు మోకాలి లోతు గుంతలు పడింది. ఈ రోడ్డుపై ప్రయాణంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ప్రతిరోజు రాజీవ్ రహదారికి వెళ్లేందుకు వందలాది మంది ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తారు. గుంతలు తప్పించబోయి అనేక మంది ప్రమాదాల బారినపడుతున్నారు. ఎన్నో యేళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– కోహెడరూరల్(హుస్నాబాద్)

సంక్షిప్త వార్తలు

◆ విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ కుషాల్‌నగర్ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరిప్రియ నగర్ ప్రాంతంలో ఉదయం 9.30గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

◆ సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి, మోత్కులపల్లి, కేశవాపూర్, మంచినీళ్లబండ గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో తిరుపతి, శ్రీనివాస్, సతీశ్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

కోహెడరూరల్(హుస్నాబాద్): సీఎం రిలీఫ్ ఫండ్ సహాయనిధిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య సూచించారు. బస్వాపూర్, కూరెళ్ల గ్రామాల్లో బాధితులకు సోమవారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందన్నారు.

◆ బీజేపీ ఎస్సీ మోర్చా నేతగా శంకర్‌బాబు

హుస్నాబాద్: బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబును ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమిస్తూ సోమవారం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నియామకం పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ బాబు మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ భూముల వివరాలు ఇవ్వాలి

కోహెడ(హుస్నాబాద్): పంచాయితీ పరిధిలోని ప్రభుత్వ భూముల వివరాలు ఇవ్వాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఆధ్వర్యంలో తహసీల్దార్ సురేఖకు వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మంజూరైయిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం స్థలం కేటాయింపునకు ప్రభుత్వ భూమి వివరాలు కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సతీశ్, రామచంద్రారెడ్డి, సాగర్, సుమన్ పాల్గొన్నారు.

◆ 15 మంది కార్యదర్శుల బదిలీ?

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని 15 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు బదిలీలు కానున్నట్లు తెలిసింది. ఈ కపూర్‌నాయక్‌తండా, చౌటపల్లి, ధర్మారం, దుబ్బతండా, గొల్లపల్లి, గుబ్బడి, కట్కూర్, మల్‌చెర్వుతండా, మంచినీళ్లబండ, మోత్కులపల్లి, నందారం, పంతుల్‌తండా, పెద్దతండా, రామవరం గ్రామాల్లో నాలుగేళ్లకుపైగా పని చేసిన కార్యదర్శులందరూ రెండు, మూడు రోజుల్లో బదిలీపై వెళ్లనున్నట్లు సమాచారం.

◆ హైదరాబాద్‌లో సిద్దిపేట 'గొల్లభామ'

సిద్దిపేటజోన్: రాష్ట్ర యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ బంజారా భవన్‌లో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట బ్రాండ్ అంబాసిడర్ గొల్లభామ ఉత్పత్తులను సెట్విన్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. గొల్లభామ చీరలు, పిల్లలు ధరించే దుస్తులను ఫ్యాషన్ షో తరహాలో ప్రదర్శించారు. జిల్లా సెట్విన్ ఇన్‌చార్జి అమీనా బేగం ఆధ్వర్యంలో యువతీయువకులు నైపుణ్య దినోత్సవంలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నివారించి ప్రకృతిని రక్షిద్దాం

మున్సిపల్ చైర్మన్ రాజనర్సు



మొక్క నాటుతున్న రాజనర్సు తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి పర్యావరణాన్ని రక్షిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు పిలుపునిచ్చారు. శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ చెట్లను కాపాడినప్పుడే వర్షాలు, స్వచ్ఛమైన ప్రాణవాయువు అందుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.